# మట్టి గాజులు

ఆ రోజు అన్ని భాషల పత్రికల్లోనూ తాటి కాయలంతేసి అక్షరాలతో వచ్చిన "పట్టుకుంటే బంగారం" అన్న వార్త ప్రపంచ ప్రజలందర్నీ విశేషంగా ఆకర్షించింది. అదేమిటంటే!

హిమాలయాల్లో గత ఏభై ఏళ్ళుగా తపస్సు చేసిన శ్రీశ్రీశ్రీ బ్రహ్మానందస్వాములవారికి భగవంతుడు క్రితం రోజు రాత్రి సాక్షాత్కరించి ఈ రోజు అంటే 8.8.2088 తేదీన భారత కాలమానం ప్రకారం సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలనుండి 12.10 ని.ల వరకు అంటే సరిగ్గా 10 నిమిషాల పాటూ ఎవరు ఏ వస్తువుని తాకినా బంగారం అయిపోతుందని సెలవిచ్చారనీ... అంతేకాకుండా ఇలా పట్టుకుంటే బంగారం అయ్యే విషయంలో గతంలో వచ్చిన "మైడాస్" ఆంగ్ల కథని దృష్టిలో వుంచుకుని కేవలం పదార్థాలని మాత్రమే తాకితే బంగారం అయ్యేటట్టు తనే సవరణ కోరినట్టు శ్రీ బ్రహ్మానందస్వాముల వారు సెలవిచ్చారు. అయితే 'ఇది' పురుషులకే పరిమితమట (భగవంతుడు పురుషుడు అవడంవల్లనేమో మరి!)

ఈ వార్త చదివీ ఎగిరి గంతేసేడు క్లర్కు కనకారావు తన భార్య వంటి మీద చిన్నమెత్తు బంగారంకూడా లేదు మరి! పెళ్లయినప్పటినుంచీ తనకి బంగారు దండ, బంగారు గాజులు కొనలేదని భార్య సాధింపులు తనకిక వుండబోవు అని అనుకుంటూంటే ఒకటే సంతోషంగా వుందతనికి.

❁ ❁ ❁ ❁

ప్రపంచ ప్రజలంతా కోట్లాది కళ్ళతో ఎదురుచూసిన క్షణం రానే వచ్చింది. ఎవరెవరి శక్త్యానుసారం వాళ్ళు రకరకాలైన వస్తువుల్ని తాకి, దండిగా బంగారం చేసుకున్నారు.

కనకారావు నిజంగా కనకారావయిపోయేడు. ఇక తన భార్య నగలు తెమ్మని అడగదని నిశ్చింతగా, హాయిగా నిద్రపోయేడా రాత్రి.

❁ ❁ ❁ ❁

ఓ నెల తర్వాత కనకారావు భార్య - అతనికి భోజనం వడ్డిస్తూ అంది - "ఈవాళ మా పిన్నీ వాళ్ళు వచ్చారు. 'ఈ బంగారం తప్ప - ఒక్క నల్లపూసల దండయినా లేదే నీ మెళ్ళో - కనీసం చేతుల్లో జత మట్టిగాజులయినా లేవే - మీ వారేం చేస్తున్నట్టు" అన్నారండీ! నేనెంత సిగ్గుగా ఫీలయ్యాననుకున్నారు? ...ఏమండేమండీ!... ఓ జత మట్టి గాజులు కొనరూ ఎంత డబ్బయినా సరే - ఈ పాడు బంగారం వేసుకుని అందరి ముందుకీ వెళ్ళలేక ఛస్తున్నా!"

ఎంతో ఖరీదయిన మట్టి గాజుల్ని కొనడమెలాగో అర్థం కాక నోట్లో పెట్టుకున్న ముద్దని నమలకుండానే ఆలోచిస్తూ వుండిపోయేడు కనకారావు.

• *ఆంధ్రజ్యోతి వీక్లీ - 16.9.88* •

• *వినాయక చవితి 1988 కాలం దాటని కథల పోటీలో ఉత్తమ కథగా బహుమతి* •